
సాక్షి గుంటూరు

ఆదివారం । 17 । మార్చి । 2024



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 513.80 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.




నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి: బెజవాడ దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి కానూరుకు చెందిన కాకర్ల పూర్ణచంద్రరావు పేరిట కాకర్ల శ్రీదేవి శనివారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.



ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు ప్రారంభం

విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లో అభివృద్ధి చేసిన రెడ్యూస్– రీసైకిల్– రీయూజ్ ప్రాజెక్టును మేయర్ భాగ్యలక్ష్మితో కలసి ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రారంభించారు.



	ఇఫ్తార్ (ఆది)	సహరి (సోమ)
చిలకలూరిపేట	6.27	4.58
గుంటూరు	6.24	4.58
బాపట్ల	6.24	4.56

న్యూస్‌రీల్

పెండ్లి కుమారుడిగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారు



మంగళగిరి: పట్టణంలో వేంచేసి వున్న శ్రీ లక్ష్మీనృసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయం పెండ్లికుమారుడి శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీవారు అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయాన్నే శ్రీవారిని అమ్మవార్లను పంచామృతస్నపనతో మంగళస్నానములు చేయించి పెండ్లికుమారుడిగా అలంకరించారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించగా భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాన్ని ఆలయ ఈవో రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

పొట్టిశ్రీరాములుకు ఘన నివాళి



గుంటూరు వెస్ట్: అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి కొనియాడారు. జయంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక మున్సిపల్ గెస్ట్ హౌస్ వద్దగల ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం అనుకున్న ఆశయం కోసం ఆయన చేసిన త్యాగం నేటి యువత తెలుసుకోవాలన్నారు. ఎందరో మహనీయులు తెలుగు రాష్ట్రాలకు ఎనలేని సేవలు చేశారని వారిలో పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని చెప్పారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు దరఖాస్తులు

గుంటూరు వెస్ట్(క్రీడలు): రానున్న వేసవికి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహించాలనుకునే క్రీడాకారులు, క్రీడా సంఘాలు, సీనియర్ క్రీడాకారులు దరఖాస్తు చేసుకుంటే అవకాశం కల్పించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ అధికారి జి.వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మే ఒకటి నుంచి 30 వరకు శిక్షణ శిబిరాలను నిర్వహించాలని కోరారు. మొత్తం 50 శిబిరాలకు అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. వచ్చే నెల 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా స్థానిక బీఆర్ స్టేడియంలోని తమ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

లోక్‌అదాలత్‌లో 156 కేసులు పరిష్కారం

నరసరావుపేట టౌన్: జాతీయ లోక్ అదాలత్‌లో 156 కేసులు పరిష్కారం కాగా రూ.1.60 కోట్లు కక్షిదారులకు లబ్ధి చేకూరిందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, 13వ అదనపు జిల్లా కోర్టు ఇన్‌చార్జి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి తెలిపారు. 13వ అదనపు జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ శనివారం నిర్వహించారు. అదాలత్‌లో సివిల్, రాజీ పడదగ్గ క్రిమినల్, చెల్లని చెక్కు, వివాహ సంబంధించిన కేసులు పరిష్కరించారు. అదాలత్‌లో న్యాయమూర్తులు కె.మధుస్వామి, టి.ప్రవల్లిక, సభ్యులు ఎం.చంద్రశేఖర్, ఆనంద్ పాల్గొన్నారు.

32 నామినేషన్లు దాఖలు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్) : స్థానిక నగరంపాలెంలోని గుంటూరు జిల్లా కోర్టులో ది గుంటూరు బార్ అసోసియేషన్ ఎన్నికల సందడి మొదలైంది. ఇప్పటికే వివిధ పదవుల కోసం పోటీల్లో ఉన్న అభ్యర్థులు తమకే ఓటేయాలంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈనెల 28న జరగనున్న ఎన్నికల దృష్ట్యా శుక్రవారం నామినేషన్ల స్వీకరణ చేపట్టిన విషయం విదితమే. ఈ క్రమంలో శనివారం కూడా పలువురు నుంచి నామినేషన్లు స్వీకరించగా ఇప్పటివరకు 32 నామినేషన్లు దాఖలయ్యాయి.

గెలుపు గుర్రాలు సిద్ధం

- వైఎస్సార్ సీపీ అభ్యర్థుల ఖరారు
- నియోజకవర్గాలలో అనుచరుల సంబరాలు



ప్రత్తిపాడులో బాణసంచా కాలుస్తున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: వైఎస్సార్ సీపీ అభ్యర్థుల జాబితాను ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం ప్రకటించారు. ఎన్నికల షెడ్యూల్‌కు కొన్ని గంటల ముందే గుంటూరు జిల్లాలోని ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థుల వివరాలు వెల్లడించారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో నలుగురు కొత్తవారికి సీట్లు కేటాయించారు. తెలుగుదేశం, జనసేన కూటమి అభ్యర్థులను ప్రకటించినా రెండుపార్టీల మధ్య సమన్వయం ఇప్పటికీ పూర్తిస్థాయిలో రాలేదు. మరోవైపు వైఎస్సార్‌సీపీ మాత్రం షెడ్యూల్‌తో సంబంధం లేకుండానే ఆరు నెలల ముందు నుంచే పార్టీ యంత్రాంగం యావత్తు జనంతో మమేకమవుతూ ఎన్నికలకు ముందస్తుగానే సిద్ధమైంది. సిద్ధం సభలు కూడా విజయవంతం కావడంతో క్యాడర్ రెట్టించిన ఉత్సాహంతో పోరుకు సన్నద్ధం అవుతున్నారు. నియోజకవర్గాలకు అభ్యర్థుల ప్రకటనతో సంబంధం లేకుండా ముందుగా పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలుగా నియమించి అభ్యర్థిత్వాలపై అన్ని కోణాల్లో వడపోత పోసింది. గుంటూరు జిల్లాలో ఏడు నియోజకవర్గాలలో నలుగురు కొత్తవారిని నియమించడమే కాకుండా, ఎంపీ అభ్యర్థిని కూడా మార్చింది. అసెంబ్లీలో మహిళల సంఖ్యను పెంచాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి గుంటూరు జిల్లా నుంచి ఏకంగా నలుగురు మహిళలకు అవకాశం కల్పించారు. ఒక పార్లమెంట్ పరిధిలో ఏడు స్థానాలకు ఏకంగా నలుగురు మహిళలను రంగంలోకి దింపడం రాష్ట్ర చరిత్రలో ఇదే మొదటిసారి.

- గుంటూరు పార్లమెంట్‌కు పొన్నూరు ఎమ్మెల్యే కిలారు వెంకట రోశయ్య అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. కిలారు రోశయ్య వరుసగా ఐదుసార్లు గెలిచిన తెలుగుదేశం నేత ధూళిపాళ్ల నరేంద్రను ఓడించి 2019లో పొన్నూరు నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. నియోజకవర్గ చరిత్రలో ఇప్పటి వరకూ జరగని అభివృద్ధిని చేసి చూపించారు. ఆయనను అధిష్టానం పార్లమెంట్‌కు ప్రమోట్ చేసింది.
- గుంటూరు తూర్పు నియోజకవర్గానికి తొలిసారి ఒక మైనారిటీ మహిళను రంగంలోకి దింపడం ద్వారా వైఎస్సార్ సీపీ చరిత్ర సృష్టించింది. 2014, 2019లో తూర్పు నియోజకవర్గం నుంచి గెలుపొందిన మహ్మద్ ముస్తఫా కుమార్తె నూరిఫాతిమాను పార్టీ రంగంలోకి దింపింది. గత రెండు సంవత్సరాలుగా ఫాతిమా తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారు.
- గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజినిని అభ్యర్థిగా ప్రకటించింది. 2019లో చిలకలూరిపేట నుంచి గెలుపొందిన ఆమె వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా పనిచేస్తున్నారు. వరుసగా రెండుసార్లు తెలుగుదేశం గెలిచిన ఈ నియోజకవర్గంలో రజిని తనదైన ముద్ర వేశారు. ఆమెకు పోటీగా ఎవరిని పెట్టాలనే దానిపై తెలుగుదేశం పార్టీ ఆత్మరక్షణలో పడిపోయి ఇప్పటి వరకూ కష్టపడ్డ వారందరిని కాదని, ఒక మహిళకు కేటాయించాల్సి వచ్చింది.
- తాడికొండ నియోజకవర్గానికి జిల్లాలో సీనియర్ రాజకీయ వేత్త, మాజీ హోంమంత్రి మేకతోటి సుచరితను రంగంలోకి దింపారు. ఆమె తన సొంత నియోజకవర్గంలో పోటీ చేయడం తొలిసారి. ఇప్పటి వరకూ ఆమె ప్రస్తుతం ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యేగా పనిచేస్తున్నారు. 2019 నుంచి 2022 వరకూ హోం మంత్రిగా పనిచేశారు.
- తెనాలి నియోజకవర్గం నుంచి అన్నాబత్తుని శివకుమార్‌కు సీటు కేటాయించారు. ఆయన 2019లో తెనాలి నుంచి గెలుపొందారు. నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు పాటుపడ్డారు. ఆ సీటును పొత్తుల్లో భాగంగా తెలుగుదేశంపార్టీ జనసేనకు కేటాయించింది. ఇక్కడ మరోసారి గెలుపు గుర్రం ఎక్కేందుకు శివకుమార్ సిద్ధం అవుతున్నారు.
- మంగళగిరి నియోజకవర్గానికి రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చిన మురుగుడు లావణ్యను ఎంపిక చేశారు. ఆమె పుట్టింటివారు, అత్తింటివారు ఇద్దరూ రాజకీయాల్లో ఉన్నవారే. ఆమె తల్లి కాండ్రు కమల ఎమ్మెల్యేగా చేయగా, మామయ్య మురుగుడు హనుమంతరావు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్నారు. ఆమె తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి లోకేష్‌ను ఢీ కొడుతున్నారు.
- పొన్నూరు నియోజకవర్గానికి అంబటి మురళీకృష్ణను అభ్యర్థిగా ప్రకటించారు. ఆయన కూడా రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచే వచ్చారు. ఆయన సోదరుడు అంబటి రాంబాబు సత్తెనపల్లి నుంచి గెలిచి జలవనరుల శాఖ మంత్రిగా పనిచేస్తున్నారు. అంబటి మురళీకృష్ణ బజరంగ్ ఫౌండేషన్ ద్వారా పొన్నూరు నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు.
- ప్రత్తిపాడు నియోజకవర్గానికి బలసాని కిరణ్‌కుమార్‌ను అభ్యర్థిగా ప్రకటించారు. ఈయన కూడా రాజకీయ నేపథ్యం నుంచి వచ్చినవారే. ఆయన తల్లి విజయవాడ నగరపాలక సంస్థలో కార్పొరేటర్‌గా పనిచేస్తున్నారు.

గుంటూరు పశ్చిమ అభ్యర్థి



నియోజకవర్గం: గుంటూరు పశ్చిమ
పేరు: విడదల రజిని
వయస్సు.: 34
విద్యార్హత: బీఎస్సీ, ఎంబీఏ
సామాజిక వర్గం: ముదిరాజ్
ఎన్నికల్లో పోటీ: రెండో సారి

రాజకీయ నేపథ్యం: ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2018లో వైఎస్సార్ సీపీలో చేరారు. చిలకలూరిపేట నుంచి పోటీ చేసి అప్పటి మంత్రి ప్రత్తిపాటి పుల్లారావును ఓడించారు. ప్రస్తుతం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా సేవలందిస్తున్నారు.

గుంటూరు తూర్పు అభ్యర్థి



నియోజకవర్గం: గుంటూరు తూర్పు
పేరు: షేక్ నూరిఫాతిమా
వయస్సు.: 41
విద్యార్హత: బీటెక్
సామాజిక వర్గం: మైనారిటీ
ఎన్నికల్లో పోటీ: తొలిసారి

రాజకీయ నేపథ్యం: ప్రస్తుతం ఆమె తండ్రి షేక్ ముస్తఫా ఎమ్మెల్యేగా పనిచేస్తున్నారు. ఆయన వారసత్వంగా రాజకీయాల్లో వచ్చారు. కొన్నేళ్లుగా తండ్రి వెంట ఉంటూ అభివృద్ధ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేశారు. అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వికలాంగులకు ట్రైసైకిళ్లు అందించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

పొన్నూరు అభ్యర్థి



పేరు: అంబటి మురళీకృష్ణ
వయస్సు.: 58
విద్యార్హత: బీటెక్
సామాజిక వర్గం: కాపు
ఎన్నికల్లో పోటీ: తొలిసారి

రాజకీయ నేపథ్యం: రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుకు సోదరుడు. 2019 ఎన్నికల్లో అంబటి రాంబాబు గెలుపునకు కృషి చేశారు. సామాజిక కార్యక్రమాలు: సామాజిక సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చి బజరంగ్ ఫౌండేషన్ స్థాపన – బజరంగ్ ఫౌండేషన్ తలసేమియా రహిత ఆంధ్రప్రదేశ్ కోసం కృషి చేస్తుంది. పొన్నూరు నియోజకవర్గంలోని 52 గ్రామాల్లో నేత్ర, గుండె, దివ్యాంగ, ఫిజియోథెరపీ ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి, అనేక వేలమందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు.



నియోజకవర్గం: తాడికొండ
పేరు: మేకతోటి సుచరిత, వయస్సు.: 53 విద్యార్హత: బీఏ
సామాజికవర్గం: ఎస్సీ , ఎన్నికల్లో పోటీ: ఐదోసారి

రాజకీయ నేపథ్యం: 2006లో ఫిరంగిపురం మండలం జడ్పీటీసీగా పోటీచేసి భారీ మెజార్టీతో విజయం సాధించారు. 2009లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశీస్సులతో పత్తిపాడు నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొంది ఆయన మరణానంతరం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఉప ఎన్నికలో గెలిచి విజయం సాధించారు. 2014లో రావెల కిషోర్ బాబుపై ఓటమి పాలవగా, 2019లో తిరిగి వైఎస్సార్‌సీపీ తరుపున డొక్కా మాణిక్య వరప్రసాద్‌పై విజయం సాధించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో ఏపీకి తొలి మహిళా హోం మంత్రిగా పదవిని అలంకరించారు. ప్రస్తుతం తాడికొండలో పార్టీ కోసం పనిచేస్తూ 2024 అసెంబ్లీ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారు.



నియోజకవర్గం: ప్రత్తిపాడు
పేరు: బలసాని కిరణ్‌కుమార్
విద్యార్హత: ఎల్ఎల్‌బీ
సామాజిక వర్గం: ఎస్సీ
ఎన్నికల్లో పోటీ: మూడోసారి

రాజకీయ నేపథ్యం: రాజకీయ వారసత్వంగా వచ్చారు. తల్లి మణిమ్మ విజయవాడ కార్పొరేషన్ కార్పొరేటర్‌గా పనిచేస్తున్నారు. కోవిడ్ సమయంలో డివిజన్ ప్రజలకు నిత్యావసర సంరకులు, వైఎస్సార్ పేరుతో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రస్తుతం ఎమ్మెల్యేగా పోటీ చేయనున్నారు.



నియోజకవర్గం: తెనాలి
పేరు: అన్నాబత్తుని శివకుమార్
విద్యార్హత: డిగ్రీ
సామాజిక వర్గం:కమ్మ
ఎన్నికల్లో పోటీ: మూడోసారి

రాజకీయ నేపథ్యం: తండ్రి అన్నాబత్తుని సత్యనారాయణ టీడీపీ హయాంలో మంత్రిగా పనిచేశారు. విద్యాసంస్థను నడుపుతున్నారు. సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. 2014లో వైఎస్సార్ సీపీలో చేరారు. ఆ ఎన్నికల్లో ఓటమి చెందారు. 2019 ఎన్నికల్లో గెలుపొందారు.



లోక్‌సభ స్థానం: గుంటూరు
పేరు: కిలారి వెంకట రోశయ్య,
వయస్సు.: 56,
విద్యార్హత: బీకాం,
ప్రస్తుత హోదా: ఎమ్మెల్యే, పొన్నూరు
సామాజిక వర్గం: కాపు,
ఎన్నికల్లో పోటీ: మూడోసారి

రాజకీయ నేపథ్యం: రోశయ్య రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చారు. గుంటూరు మిర్చి యార్డుకు చైర్మన్‌గా పనిచేశారు. 1993లో మిర్చి అసోసియేషన్‌కు ఉపాధ్యక్షుడిగా, 1994లో మిర్చియార్డు చైర్మన్‌గా పనిచేశారు. తెనాలి అసెంబ్లీకి పోటీ చేసి ఓటమి చెందారు. 2019లో వైఎస్సార్ సీపీలో చేరారు. పొన్నూరు నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు.



నియోజకవర్గం: మంగళగిరి
పేరు: మురుగుడు లావణ్య
వయస్సు.: 39 విద్యార్హత: ఎంకాం, ఎల్ఎల్‌బీ
సామాజిక వర్గం: చేనేత
ఎన్నికల్లో పోటీ: తొలిసారి

రాజకీయ నేపథ్యం: గృహిణిగా ఉన్న మురుగుడు లావణ్య తల్లి కాండ్రు కమల మాజీ మంగళగిరి మున్సిపల్ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యురాలిగా గతంలో పనిచేశారు. లావణ్య మామ మురుగుడు హనుమంతరావు ఎంఎల్‌సీ, ఉన్నారు. బీసీ వెల్ఫేర్ కమిటీ లెజిస్లేటివ్ అసెంబ్లీ, ఆప్కో చైర్మన్‌గా పనిచేశారు.

జీజీహెచ్‌లో రూ.70 లక్షలతో గైనిక్ వార్డు ఆధునికీకరణ

- వార్డును ప్రారంభించిన మంత్రి విడదల రజిని

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో గైనకాలజీ వైద్య విభాగంలో బాలింతలు, మహిళల కోసం రూ.70 లక్షలతో ఆధునికీకరించిన వైద్య విభాగాన్ని శనివారం ఉదయం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ప్రారంభించారు. మంత్రి విడదల రజిని భారత పరిశ్రమల సమాఖ్య ప్రతినిధులను కలిసి గైనిక్ వార్డును ఆధునికరించాలని కోరారు. ఈనేపథ్యంలో కార్పొరేట్ రెస్పాన్స్‌బులిటీలో భాగంగా భారత పరిశ్రమల సమాఖ్య సౌజన్యంతో వార్డు నిర్మాణం చేపట్టారు. ఈసందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ గుంటూరు జీజీహెచ్, గుంటూరు వైద్య కళాశాల ఆధునికీకరణ పనుల కోసం నాడు– నేడులో భాగంగా ప్రభుత్వం రూ.500 కోట్లు విడుదల చేసిందని వివరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వైద్యులు, వైద్య సిబ్బంది పోస్టులను ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిందని చెప్పారు. ఏ ఒక్క పోస్టు కూడా ఖాళీ లేకుండా ప్రతినెలా పోస్టులన్నీ భర్తీ చేస్తూ అదనంగా పోస్టులను మంజూరు చేశామన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ 40 పడకలతో బాలింతలు, పసికందులు ప్రశాంత వాతావరణంలో సౌకర్యవంతమైన వైద్యం పొందేలా వార్డును ఆధునికీకరించామని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 40 పడకలకు ఏసీ సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. ట్రాలీలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. భారత పరిశ్రమ సమాఖ్య వార్డు గైనిక్ వార్డును ఆధునికీకరించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. జీజీహెచ్ అభివృద్ధి కోసం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ నివాస్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నరసింహం, జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్, ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, పలువురు ప్రజాప్రతినిధులు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో భారత పరిశ్రమ సమాఖ్య ప్రతినిధులు, సీఐఏ అధ్యక్షుడు లక్ష్మీప్రసాద్, పూర్వ అధ్యక్షుడు రామకృష్ణ, గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ అరుణ, ప్రొఫెసర్ జయంతి, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఎస్.ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

నగరంలో రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు తొలగింపు



అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూ నగర్: సార్వత్రిక ఎన్నికల కోడ్ శనివారం నుంచే అమలులో ఉంటుందని, నగరంలో రాజకీయ పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు తక్షణం తొలగించాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్(ఆర్ఓ) కీర్తి చేకూరి పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఎన్నికల కోడ్ వచ్చిన సందర్భంగా శనివారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో సెక్టార్ అధికారులు, ఎంసీసీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ మేరకు 24 గంటల్లో నగరంలోని ప్రభుత్వ ఆస్తులపై ఉన్న అన్ని రకాల వాల్ రైటింగులు, పోస్టర్లు, కటౌట్లు, హోర్డింగులు, బ్యానర్లు, జెండాలు తొలగించాలని కోరారు. బహిరంగ ప్రదేశాలు, బస్టాండ్, రైల్వే స్టేషన్లు, రైల్వే, రోడ్డు వంతెనలు, ప్రభుత్వ బస్సులు, విద్యుత్ స్తంభాలు, మున్సిపల్ సమావేశ ప్రదేశాల్లోని అన్ని రకాల రాజకీయపరమైన ప్రకటనలు, వాల్ రైటింగులు, పోస్టర్లు, కటౌట్లు అన్నింటినీ వెంటనే తొలగించాలని ఆదేశించారు.

ఫ్లెక్సీల తొలగింపు..

కమిషనర్ ఆదేశాల మేరకు నగరంలో అన్ని ప్రాంతాల్లో రాజకీయ పార్టీల పోస్టర్స్, బ్యానర్స్, హోర్డింగ్‌లను యుద్ధప్రాతిపదికన తొలగించార. రాజకీయ నాయకుల విగ్రహాలకు తెల్లటి క్లాత్ తో ముసుగులు తొడగాలన్నారు. వార్డు సచివాలయాల్లో, నగర పాలక సంస్థ కార్యాలయాల్లోని కౌన్సిల్ సమావేశ మందిరం, మీటింగ్ హాల్స్, విభాగాధిపతుల చాంబర్లు, అన్ని విభాగాల్లో ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫొటోలను తొలగించాలన్నారు. వాటర్ టాంకర్లు, పారిశుద్ధ్య, మరియు నగర పాలక సంస్థ వాహనాలపై కూడా రాజకీయ గుర్తులతో కూడిన స్టిక్కర్లు ఉంటే తొలగించాలని సూచించారు.

మోగిన ఎన్నికల నగారా



- మే 13న పోలింగ్
- జూన్ నాలుగున కౌంటింగ్
- జిల్లాలో ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి
- షెడ్యూలు విడుదల కావటంతో ప్రవర్తన నియమావళి అమలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఎన్నికల నగారా మోగింది. సార్వతిక ఎన్నికలకు సంబంధించి లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల అయింది. లోక్‌సభతో పాటు అసెంబ్లీ ఎన్నికలు కూడా మే 13న నిర్వహించనున్నారు. ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదల కానుంది. అదే రోజు నుంచి నామినేషన్లలను స్వీకరిస్తారు. ఏప్రిల్ 25వతేది వరకు నామినేషన్ల స్వీకరణకు తుదిగడువుగా నిర్ణయించారు. ఏప్రిల్ 26న నామినేషన్ల పరిశీలన, నామినేషన్లకు తుదిగడువు 29వ తేదీగా ప్రకటించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ప్రధాన పార్టీలైన వైఎస్సార్ సీపీ, తెలుగుదేశం– జనసేన కూటమి కూడా తమ అభ్యర్థులను ప్రకటించేశాయి. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చింది.

ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి...

ఇప్పటికే జిల్లా ఎన్నికల అధికారి ఎం.వేణుగోపాలరెడ్డి నేతృత్వంలో పోలింగ్‌కు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం కలెక్టరేట్ వీసీ సమావేశమందిరం నుంచి జిల్లా కలెక్టర్ సార్వత్రిక ఎన్నికల ప్రవర్తన నియమావళిపై రిటర్నింగ్ అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల నోడల్ అధికారులు, జిల్లా, రెవెన్యూ, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగో విడతలో లోక్ సభ, శాసనసభకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకటించటం జరిగిందన్నారు. షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి ఓట్లు లెక్కింపు జరిగే జూన్ 4వ తేదీన ఫలితాలు ప్రకటించే వరకు ఎన్నికల ప్రవర్త నియమావళి అమల్లో ఉంటుందని వివరించారు. ప్రభుత్వ భవనాలు, కార్యాలయాల్లో ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి సహా మంత్రుల ఫొటోలు ఉండరాదని, ఫొటోలతో కూడిన ప్రభుత్వ ప్రకటనలు, అన్ని రకాల వాల్ రైటింగులు, పోస్టర్లు, కటౌట్లు, హోర్డింగులు,బ్యానర్లు,జెండాలు వంటివన్నీ తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే నిధులు లేక ఇతర ప్రభుత్వ పథకాల నిధులతో నిర్వహించే వాటర్ ట్యాంకులు, అంబులెన్సులపై తినిధుల ఫొటోలు తీసివేయాలన్నారు. మంత్రులు, ప్రజా ప్రతినిధుల పర్యటనలో అధికారులు పాల్గొన రాదని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా ఏ రాజకీయ పార్టీకైనా అనుకూలంగా వ్యవహరించినా లేదా ఆయా పార్టీలు నిర్వహించే ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నా, గిఫ్టులు, ఇతర లబ్ధి పొందినా అలాంటి వారిపై సీసీఏ నిబంధనలు ప్రకారం ఐపీసీ సెక్షన్ 171 మరియు 1951 ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని 123,129,134,134 (ఎ) నిబంధనలు ప్రకారం క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జీవిత భాగస్వామి రాజకీయ రంగంలో చురుకుగా ఉన్న అధికారులందరూ ప్రధాన కార్యదర్శి యొక్క నిర్దిష్ట అనుమతితో మినహా ఎన్నికలు పూర్తయ్యే వరకు సెలవుపై లేదా పర్యటనలో వారి ప్రధాన కార్యాలయాన్ని వదిలి వెళ్ల కూడదన్నారు. బడ్జెట్ ప్రొవిజన్ ఉన్నప్పటికీ నూతన ప్రాజెక్టులు, పథకాల మంజూరు, గ్రాంట్లు, హామీలు, శంకుస్థాపనలు పూర్తిగా నిషేధమని, వర్క్ ఆర్డర్ ఉన్న క్షేత్ర స్థాయిలో పనులు మొదలు కాని పనులు చేపట్టకూడదని తెలిపారు. ఆరోగ్య సురక్ష క్యాంపులు,రాజకీయ నాయకులు చిత్ర పటాలు లేకుండా యథావిధిగా కొనసాగించవచ్చన్నారు.

టీడీపీ హయాంలోనే యూ–1 జోన్ ఏర్పాటు

- నిబంధనలు పొందుపరించిది వాళ్లే
- సీఎం వైఎస్ జగన్ చొరవతోనే జోన్ ఎత్తివేత
- ఒక్క రూపాయి కూడా రైతులు చెల్లించాల్సిన అవసరం లేదు
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి



వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

తాడేపల్లిరూరల్: తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడే వారి సొంత పార్టీ సామాజిక వర్గానికి చెందిన వారి ప్రయోజనాల కోసం వారి భూములను వదిలి వేసి చిన్న, సన్నకారు రైతుల భూములను యూ–1 జోన్‌గా ఏర్పాటు చేసి నిబంధనలు పొందుపరిచి పదేళ్లుగా రైతులకు ఇబ్బందులకు గురిచేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి యూ–1 రిజర్వ్ జోన్‌ను ఎత్తివేస్తూ ప్రత్యేక జీఓను తీసుకు వచ్చి, రైతులు ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదంటూ ప్రకటించారు. దీంతో తాడేపల్లి పట్టణ, కుంచనపల్లి, ఉండవల్లి గ్రామాలకు చెందిన రైతులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి శనివారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), వైఎస్సార్‌సీపీ ఎంటీఎంసీ అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి వేర్వేరు కార్యక్రమాల్లో మాట్లాడుతూ ఎన్నికలు సమీపించడంతో ఇప్పుడు యు–1 రిజర్వ్ జోన్ ఎత్తివేస్తామని తెలుగుదేశం నాయకులు ప్రకటిస్తున్నారని విమర్శించారు.

ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి

మంగళగిరి: ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సన్నద్ధం కావాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ రాజకుమారి గణియా సూచించారు. పట్టణంలోని మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణపై శనివారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో అధికార యంత్రాంగం అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ నిర్మల్‌కుమార్, అసిస్టెంట్ కమిషనర్ బి.శివారెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తులో గ్రూప్-1 పరీక్ష కేంద్రాలు

- అభ్యర్థుల సౌకర్యార్థం హెల్ప్‌డెస్క్‌లు, ఫోన్ నంబర్లు
- జిల్లా ఎస్పీ తుషార్ డూడీ



నగరంపాలెం: జిల్లాలో ఆదివారం జరగనున్న ఏపీపీఎస్సీ గ్రూప్- 1 పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 23 కేంద్రాల్లో సుమారు 15,040 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. ప్రశ్న పత్రాలను కేంద్రాల వద్దకు తరలించేందుకు సాయుధ ఎస్కార్ట్ సిబ్బంది విధుల్లో ఉంటారని పేర్కొన్నారు. మొదటి పరీక్ష ఉదయం 9.45 నిమిషాల లోపు, రెండో పరీక్షకు మధ్యాహ్నం 1.45 గంటలలోపు మాత్రమే అనుమతిస్తామని తెలిపారు. ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదని, మాల్ ప్రాక్టీస్‌కు అవకాశాల్లేకుండా ప్రతి అభ్యర్థిని తనిఖీ చేసేందుకు ఫ్రిస్కింగ్ యాక్సెస్ కంట్రోల్ ఏర్పాటు చేశామని తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థులకు పరీక్ష కేంద్రాల చిరునామా వివరాలు తెలిపేందుకు గుంటూరు రైల్వేస్టేషన్ తూర్పు, పశ్చిమ వైపు ద్వారాల వద్ద, గుంటూరు ఆర్టీసీ బస్టాండ్, హిందూ కళాశాల జంక్షన్ల వద్ద పోలీస్ హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల సమాచారం తెలుసుకునేందుకు అభ్యర్థులు డయల్-100, 86888 31568, 86888 31392 నంబర్లల్లో సంప్రదించవచ్చునని ఎస్పీ తెలిపారు.

ఆదర్శ గ్రామంగా అంకిరెడ్డిపాలెం అభివృద్ధి

అభివృద్ధి పనులు ప్రారంభించిన విప్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



శిలాఫలకం ఆవిష్కరించిన విప్ లేళ్ల అప్పిరెడ్డి, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము

గుంటూరు రూరల్: రాష్ట్రానికే రోల్ మోడల్‌గా అంకిరెడ్డిపాలెం గ్రామాన్ని అన్ని హంగులతో తీర్చిదిద్దినట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన జగనన్న పార్కు, క్రీడా ప్రాంగణం, డాక్టర్ వైఎస్సార్ లేక్ వ్యూ, హిందూ శ్మశాన వాటిక, గెస్ట్ రూమ్స్, సీసీ రోడ్లు, సైడు కాలువలు, ఆర్చి తదితర ప్రగతి పనులకు జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, స్థానిక కార్పొరేటర్ శ్యామల వెంకట రమణాదేవి బ్రహ్మారెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం సభలో లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడారు. అంకిరెడ్డిపాలెంలో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. జెడ్పీ హైస్కూలు ఆధునీకరణ, జూనియర్ మహిళా కళాశాల, సింథటిక్ బాస్కెట్ బాల్ కోర్టు, క్రికెట్ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అంకిరెడ్డిపాలెం అభివృద్ధి కమిటీ ప్రతినిధులు లేళ్ల పెద్ద అప్పిరెడ్డి, కుర్రా సాంబిరెడ్డి, మున్నంగి సంజీవరెడ్డి, దేవగిరి వీర గంగాధరరెడ్డి, గుంటూరు అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీల్లో రేపల్లె వాసులకు చోటు

రేపల్లె రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమించిన కమిటీలలో రేపల్లె నియోజకవర్గంకు చెందిన పలువురికి స్థానం లభించింది. బాపట్ల జిల్లా మైనార్టీ విభాగం కమిటీలో రేపల్లెకు చెందిన పలువురికి పదవులు దక్కాయి. బాపట్ల జిల్లా మైనార్టీ విభాగం వైస్‌ప్రెసిడెంట్‌గా షేక్ అలీ బుడా, జనరల్ సెక్రటరీగా షేక్ అన్వర్, జాయింట్ సెక్రటరీగా అబ్దుల్ మైమూద్, కార్యదర్శులుగా షేక్ మునీర్, షరీఫ్‌బేగ్‌లు నియమితులయ్యారు.

జిల్లా యువజనవిభాగం

వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ బాపట్ల జిల్లా యువజన విభాగంలో రేపల్లె నియోజకవర్గానికి చెందిన పలువురు ఎంపికయ్యారు. వైస్‌ప్రెసిడెంట్‌గా నల్లగుర్ల దేవీప్రసాద్, జనరల్‌సెక్రటరీగా కొలగాని శ్రీనివాసరావు, సెక్రటరీలుగా దొంతిబోయిన ఏడుకొండలురెడ్డి, కొక్కిలిగడ్డ ప్రశాంత్, జాయింట్ సెక్రటరీలుగా శీలం పూర్ణచంద్రశేఖరరెడ్డి, తూనుగుంట్ల సుమన్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా డి.నాగమల్లేశ్వరరావు, పూర్ణ శివనాగ దుర్గావెంకటేశ్వరరావులు నియమితులయ్యారు.

మండలాల అధ్యక్షుల నియామకం

వైఎస్సార్ సీపీ యువజన విభాగం రేపల్లె పట్టణ అధ్యక్షుడుగా ఆలా రాజ్‌పాల్, రేపల్లె మండల అధ్యక్షుడుగా యంద్రపాటి సుధీర్, నిజాంపట్నం మండల అధ్యక్షుడుగా మోపిదేవి సాయికిరణ్‌లు ఎన్నికయ్యారు.

గుంటూరు జిల్లాలో పలువురికి చోటు..

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని పలువురిని పార్టీ పదవుల్లో నియమించారు. ఈ మేరకు శనివారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. గుంటూరు జిల్లాకు చెందిన జనాబ్ మొహమ్మద్ బాబుఖాన్‌ను వైఎస్సార్ సీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా, సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బుర్రా వెంకటశివారెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా గురుశెట్టి రవీంద్రనాయుడు, నల్లగంటి శ్రీనును నియమించారు.

బీసీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా శివశంకర్

పట్నంబజారు: ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన పేరేచర్ల శివశంకర్‌ను పార్టీ గుంటూరు జిల్లా బీసీ విభాగం ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ శనివారం వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

గురుకుల కళాశాలలో అండర్-20 రెజ్లింగ్ ఎంపికలు



రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

అచ్చంపేట: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన అండర్-20 స్త్రీ,పురుషుల రెజ్లింగ్(కుస్తీ) ఎంపికలు జరిగాయి. ఫ్రీస్టయిల్ పురుషుల విభాగంలో టి.రోహిత్, ఆర్ శ్రీహరి, టి.శ్రీహరి, కె.ప్రభాకర్‌లు ఎంపికై నారు. పురుషుల గ్రీకోరోమన్ విభాగంలో కె.రాహుల్, బి.తేజ, ఎస్.బాలకోటేశ్వరరావు, ఎస్ తేజోకుమార్, జిఇస్సాకు, ఎ.వి జయకుమార్, పి.నవీన్‌లో ఎంపికైనారు. క్రీడాకారులంతా ఈనెల 20న చిత్తూరులో జరిగే రాష్ట్రస్థాయిలో పోటీలలో పాల్గొననున్నట్లు గుడిపూడి భూషణం తెలిపారు.

మద్యం మత్తులో అగ్నిమాపక శాఖాధికారి హల్‌చల్



పోలీసులతో వాదులాడుతున్న శ్రీనివాసరెడ్డి

పట్నంబజారు: మద్యం మత్తులో ఆటోను ఢీకొట్టిన అగ్నిమాపక శాఖ అధికారిపై కేసు నమోదైంది. వెస్ట్ ట్రాఫిక్ పోలీసుల వివరాల మేరకు.. నెల్లూరు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారిగా పనిచేస్తున్న వాకా శ్రీనివాసరెడ్డి శనివారం సాయంత్రం స్తంభాలగురు వైపు నుంచి కారులో వస్తున్నారు. ఈ క్రమంలో యేలే ఆంజనేయులు అనే వ్యక్తి ఆటోను వెనుక నుంచి వేగంగా ఢీకొట్టారు. ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని స్టేషన్‌కు రావాలని చెప్పడంతో.. వారిని సదరు అధికారి ఇష్టానుసారంగా దుర్భాషలాడారు. స్టేషన్‌కు వచ్చిన తర్వాత కూడా హల్‌చల్ చేశారు. శ్వాస పరీక్ష నిర్వహించే సమయంలో సిబ్బందితో దురుసుగా ప్రవర్తించారు. బ్రీత్ ఎనలైజర్ పరీక్ష మీరే చేయించుకోండి అంటూ.. ఇష్టానుసారంగా వ్యవహరించారు. కారు దిగకుండా ట్రాఫిక్ పోలీసులను ఇబ్బందులకు గురి చేసినట్లు తెలుస్తోంది. మద్యం సేవించినట్లు పరీక్షలో గుర్తించామని, కేసు నమోదు చేసి, కారును సీజ్ చేసినట్లు వెస్ట్ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు.


రాష్ట్రస్థాయి సైన్స్ ఆవిష్కరణ పోటీలు ప్రారంభం



ఏపీ సైన్స్ సిటీ సీఈఓ డాక్టర్ జయరామిరెడ్డికి సత్కారం

తాడేపల్లిరూరల్ : వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో రాష్ట్రస్థాయి సైన్స్ ఆవిష్కరణ పోటీలను ఆవిష్కార్-2023 పేరుతో ఏపీ సైన్స్ సిటీ, విభా, భారతీయ విజ్ఞాన మండలి, కేఎల్‌యూ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఢిల్లీ విద్యాశాఖ జాతీయ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ గంటి ఎస్.మూర్తి, ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ టి. శ్రీనివాసరెడ్డి, ఏపీ సైన్స్ సిటీ సీఈఓ డాక్టర్ కె.జయరామిరెడ్డి, యూనివర్శిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారధివర్మ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. డాక్టర్ జయరామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని సూచించారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారి ప్రాజెక్టులను జాతీయ స్థాయి పోటీలకు పంపుతామన్నారు. ప్రొఫెసర్ గంటి ఎస్.మూర్తి మాట్లాడుతూ నేటి తరంలో భారతదేశానికి మరో ఆర్యభట్ట, సుశ్రుతుడు అవసరమన్నారు. ఏటా దేశంలో 25 కోట్ల మంది నూతన పట్టభద్రులు ఆయా కళాశాలల నుంచి బయటకు వస్తున్నారని, వారందరికీ ఉద్యోగాల కల్పన జరగాలంటే నూతన ఆవిష్కరణలు తప్పనిసరి అని స్పష్టం చేశారు. అనంతరం డాక్టర్ జయరామిరెడ్డి, ప్రొఫెసర్ గంటి ఎస్.మూర్తిలను వీసీ డాక్టర్ పార్థసారధివర్మ ఘనంగా సత్కరించారు. వర్సిటీ ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం, పలు విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి



నుజ్జునుజ్జయిన ఆటో

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ డి.నరేష్‌కుమార్ వివరాల మేరకు.. వెంగళాయపాలేనికి చెందిన శ్రీరాంశెట్టి ఎర్రయ్య(45)కు భార్య పద్మ, ఇరువురు పిల్లలున్నారు. విజయవాడ కృష్ణలంకకు చెందిన ఎర్రయ్య బావమరిది ఈపూరి వెంకటేశ్వరరావు(32) సాయంత్రం వెంగళాయపాలెంలోని ఎర్రయ్య ఇంటికి వచ్చాడు. కుటుంబ సభ్యులను, బంధువులను కలిశాడు. తిరిగి విజయవాడకు ఆటోలో ఎర్రయ్య, వెంకటేశ్వరరావు బయలుదేరారు. ఈ క్రమంలో ఎన్‌హెచ్ 16లో ఎదురుగా విజయవాడ నుంచి రాయచోటికి వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సును వేగంగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జవ్వగా, బస్సు స్వల్పంగా దెబ్బతింది. ఆటోలోని ఎర్రయ్య, వెంకటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుల వివరాలు తెలుసుకుని, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. జీజీహెచ్ మార్చురీలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించారు. ఘటనపై మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. మృతుల కుటుంబ సభ్యులను ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ సోదరుడు రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించారు. అండగా ఉంటామని, కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఇన్విజిలేటర్లు సీఎస్‌లకు రిపోర్టు చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ఇన్విజిలేషన్ విధులు కేటాయించిన ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు ఆదివారం ఉదయం తమకు కేటాయించిన పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌కు రిపోర్టు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గైర్హాజరైతే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.